batukammanews.com
TEL/2019/78873
# బతుకమ్మ
తాజా వార్తల సద్దిమూట
28 అక్టోబర్ 2026
బుధవారం

## పదేళ్ల పాలనలో ఏం చేశారు..?

- ఎల్‌నినోపైనా రాజకీయాలా..!
- బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు
- వేల్పూర్ లో ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల నిర్మాణాల పరిశీలన
- రోడ్లు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఆదేశాలు

2 లో



- తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క




- నిజామాబాద్ జిల్లాలో జోరుగా ఫేక్ డాక్యుమెంట్ల తయారి..
- దర్జాగా భూముల యజమాన్యాల హక్కుల మార్పిడి ..
- రిజిస్ట్రార్లు, జాయింట్ రిజిస్ట్రార్లు సహకారంతో భూమార్పిడి..
- చేతులు మారుతున్నకోట్ల రూపాయలు..
- నిజామాబాద్ నగరంలో విలేకరుల ముసుగులో భూదందాలు..!

# విలేకరులే.. దస్తావేజులేఖరులుగా..!

2 లో

నిజామాబాద్ నగరంలో కొందరు విలేకరులు (కేవలం ఐడికార్డులతో) చేస్తున్న దందాలు అన్నీఇన్నీకావు. ప్రధానంగా ఇటీవల కాలంలో దస్తావేజులేఖరులుగా అవతారమెత్తారు. ప్రధానంగా రెవెన్యూ, మీ సేవా, మున్సిపల్, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అడ్డాలు వేసుకుని అక్రమ ఫేక్ డాక్యుమెంట్ల తయారిని నడుపుతున్నారు.
వారసులు లేని, వివాదాలు ఉన్న భూములు, మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేసిన (పది శాతం భూముల)కు డాక్యుమెంట్లను చేసి విక్రయించే దందా జోరుగా సాగుతుంది.

– నిజామాబాద్, బతుకమ్మ

## మాదవనగర్ ఆర్వోబీకి నిధుల కొరత..

# కొడంగల్‌కు వందల కోట్లు!



2 లో

రేవంత్ రాష్ట్రానికి సీఎంమా ? కొడంగల్‌కు ముఖ్యమంత్రా ?
ఆర్వోబి నిధుల దీక్షలో బిజెపి శాసనసభపక్ష నేత మహేశ్వర్ రెడ్డి



మాధవ నగర్ ఆర్వోబికి 9 కోట్లు కూడా ఇవ్వని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ కి మాత్రం వందల కోట్లు నిధులు తరలిస్తున్నారని బిజెపి శాసనసభపక్ష నేత మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. రేవంత్ రాష్ట్రానికి సిఎంగా ఉన్నాడా? లేక కొడంగల్ కి మాత్రమే ముఖ్యమంత్రేనా అని ప్రశ్నించారు. మంగళవారం మాదవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిధుల కోసం నిరసన దీక్ష కార్యక్రమం నిర్వహించారు.

– నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ

## రూ.42.80 కోట్లతో

# రహదారులకు మహర్దశ

అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి సీతక్క

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో గ్రామీణ రహదారుల అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్

– ఎల్లారెడ్డి, బతుకమ్మ



మిగితా..2 లో

## ప్రభుత్వ పాఠశాలలో

# విద్యార్థికి పాముకాటు..!

ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వైనం





2 లో

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థి పాము కాటుకు గురైన సంఘటన నిజామాబాద్ నగరంలోని బోర్గాం ప్రైమరీ పాఠశాలలో చోటు చేసుకుంది. ఒకటవ తరగతి విద్యార్థి దేవాన్ష్ ఎప్పటి లాగే పాఠశాలకు మంగళవారం వెళ్లాడు.

– నిజామాబాద్ సిటీ, బతుకమ్మ

# మాదవనగర్ ఆర్వోబీకి నిధుల కొరత.. కొడంగల్‌కు వందల కోట్లు!

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పిసిసి చీఫ్ గా తప్పుడు హామీలిచ్చి సీఎం అయ్యాడని, ఎన్నికల్లో దేవుళ్ల మీద ఒట్టేసి తప్పుడు హామిలిచ్చి జనాన్ని మోసం చేసిండు రేవంత్ రెడ్డి అన్నారు. ఫీ రియంబర్స్ మెంట్, రైతు భరోసా, రైతు సబ్సిడీ ఏది ఇవ్వలేదని,రాష్ట్రంలో అవినీతికి రేవంత్ ఆజ్యం పోసాడన్నారు. రేవంత్ కుటుంబం అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా మారి, రేవంత్ సీఎంగా ఢిల్లీకి డబ్బుల సంచుల మూటాలు మోస్తున్నాడని అరోపించారు. ఢిల్లీ వీధుల్లో ఆందోళన పేరుతో పోలీసుల మీద దాడి చేస్తున్నాడని, దేశ వ్యాప్తంగా అల్లర్లు సృష్టించేందుకు రేవంత్ సహకరిస్తున్నారన్నారు. దేశంలో విచ్చిన్న శక్తుల కుట్రలను అడ్డుకుంటామని, జెన్ జీ కాంగ్రెస్ కోసం కాదు దేశం కోసం నిలబడుతుందన్నారు. రాహుల్ ని ప్రధానిని చెయ్యటం కోసం కాంగ్రెస్ అల్లర్లను సృష్టిస్తుందని,రేవంత్ పాలన అవినీతి, కుంభకోణాల మయంగా మారిందన్నారు. సివిల్ సప్లయ్ లో జరిగిన కుంభకోణం వల్లే బియ్యం ధరలు పెరిగాయని, ఎల్ నినో పై సిఎంకు ముందు చూపు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల ప్రభుత్వమని విమర్శించారు.

**తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం రైల్వే బ్రిడ్జి లను నిర్లక్ష్యం చేస్తోంది : ఎంపీ అరవింద్ ధర్మపురి**

కేంద్రం రాష్ట్రంలో రైల్వేబ్రిడ్జిలకు, ఇతర పథకాలకు నిధులు ఇస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. కేంద్రం నిధులుస్తున్నా రాష్ట్రం సహకరించడం లేదన్నారు. బిఆర్ఎస్ హాయంలో కమిషన్ ల భయానికి కాంట్రాక్టర్లు పారిపోయారని గుర్తు చేశారు. మా నాన్న అడిగితేనే కాంగ్రెస్ లో చేరలేదని, రేవంత్ రమ్మంటే వెళ్తానా? అని ప్రశ్నించారు. రైల్వే నిధుల కోసం నేను ధర్నా ప్రకటిస్తే కాంగ్రెస్ నేతలు సీఎం ను కలిశారన్నారు. కౌన్సిలర్



కూడా గెలవలేని మహేష్ గౌడ్ ను పార్టీ అధ్యక్షునిగా ఎందుకు చేశారో ఆ పార్టీ నాయకులకే అర్థం కావడం లేదన్నారు. రాజకీయాలు పక్కనబెట్టి నిధులు మంజూరు చేయాలని కోరారు. 9 కోట్ల ఫైనాన్స్ క్లీయరెన్స్ ఇప్పించడం లేదన్నారు.

**రైల్వే ఓవర్ బ్రిడ్జికి నిధుల కోసం బిక్షాటన**

నిజామాబాద్ మాదవనగర్ ఆర్వోబి కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని నిరసిస్తూ బీజేపీ నిరసన దీక్ష చేపట్టిన విషయం తెల్సిందే. ఇటీవల ముఖ్యమంత్రిని జిల్లా నేతలు కలిసినా ఎన్నోసార్లు వినతి పత్రాలు సమర్పించినా ప్రభుత్వం స్పందించకపోవడంతో బీజేపీ నాయకులు బిక్షాటన చేశారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డితో కలిసి బిక్షాటన చేశారు. ఆర్వోబి వద్ద నుంచి వెళ్తున్న బస్సులో ప్రయాణిస్తున్న వారి నుంచి రోడ్డుపై వెళ్తున్న వారిని బిక్షం వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, స్రవంతిరెడ్డి, ఫ్లోర్ లీడర్ ప్రమోద్ కుమార్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దంపాల జ్యోతి, వివిధ మోర్చాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్ల పాలనలో ఏం చేశారు..?

వేల్పూర్, బతుకమ్మ : పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎంత చిత్తశుద్ధితో పనిచేసిందో ఆ పార్టీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టని వారు, ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చాక ప్రభుత్వంపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని వ్యాఖ్యానించారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలో రాష్ట్ర మంత్రి సీతక్క ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కాలనీని సందర్శించి, లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్లను పరిశీలించారు. కాలనీలో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలను స్థానికుల ద్వారా తెలుసుకున్నారు.కాలనీలో రోడ్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరంతో పాటు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్ల సమస్యను మంత్రి దృష్టికి తీసుకురాగా,సంబంధిత శాఖల సూపరింటెండింగ్ ఇంజినీర్లతో (ఎస్ఈలు) ఫోన్‌లో మాట్లాడారు. కాలనీవాసులకు ఇబ్బందులు కలగకుండా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం బీఆర్ఎస్ పార్టీ తీరుపై మంత్రి సీతక్క విమర్శలు చేశారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో వరదలు, కరువు పరిస్థితులు, కరోనా మహమ్మారి వంటి సంక్షోభాలు ఎదురైనప్పుడు కాంగ్రెస్ పార్టీ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ ప్రభుత్వానికి సహకరించిందని పేర్కొన్నారు.ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలపై చర్చ జరుగుతుండగా, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమంటూ బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆమె విమర్శించారు. ఎప్పుడు చూసినా ప్రజల్లో అపోహలు సృష్టించే విధంగా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించారు.గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో వరదలు, కరువు పరిస్థితులు, కరోనా మహమ్మారి వంటి ఎన్నో సంక్షోభాలు ఎదురయ్యాయని సీతక్క గుర్తుచేశారు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పులు ఏ ప్రభుత్వ హయాంలోనైనా సంభవించే అవకాశాలు ఉంటాయని, అలాంటి పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిందని, అవసరమైన సందర్భాల్లో ప్రజల పక్షాన నిలిచిందని తెలిపారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతంలో మార్పులు,వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం వంటి అంశాలపై చర్చ జరుగుతుండగా,వాటికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమన్నట్లుగా బీఆర్ఎస్ ప్రచారం చేయడం సరికాదని మంత్రి విమర్శించారు. వాతావరణ పరిస్థితులను రాజకీయాలకు ముడిపెట్టి ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేయడం తగదని అన్నారు. రైతులకు భరోసా కల్పించడం, వ్యవసాయ రంగానికి అవసరమైన సహకారం అందించడం, ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించడం రాజకీయ పార్టీల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో నిర్మాణాత్మక సూచనలు చేయాల్సిన ప్రతిపక్షం,ప్రభుత్వంపై నిరంతరం విమర్శలు చేయడానికే పరిమితమవుతోందని సీతక్క వ్యాఖ్యానించారు. ప్రజలకు ఉపయోగపడే సూచనలు చేయడం, అభివృద్ధి పనులకు సహకరించడం, ప్రజా సంక్షేమం కోసం కృషి చేయడం ప్రతిపక్ష బాధ్యత అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు??ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, మహిళా సంక్షేమం, రైతుల అభ్యున్నతి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విమర్శలు చేయడం సులభమని, కానీ ప్రజల అవసరాలను గుర్తించి సమస్యలను పరిష్కరించడమే నిజమైన పాలనకు నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారాలు చేసినంత మాత్రాన వాస్తవాలు మారవని సీతక్క వ్యాఖ్యానించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలకు బదులుగా నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. కరోనా సమయంలో అసెంబ్లీలో మాస్కులు అడిగితే తనను అవమానకర రీతిలో కేసీఆర్ మాట్లాడారని ఒక్క పారాసిటిమల్ గోలి వేసుకుంటే కరోనా ఖతమని 30 డిగ్రీలు దాటితే కరోనా వైరస్ బ్రతకదని ముందు చూపు లేకుండా మాట్లాడారని కాంగ్రెస్ ప్రభుత్వం వారి విధంగా ముందు చూపు లేకుండా మాట్లాడదని అందుకే ఎల్ నినో పరిస్థితులపై ముందుగానే అప్రమత్తం చేస్తున్నామని అన్నారు.

# విలేకరులే ... దస్తావేజులేఖరులుగా..!

ఏకంగా డాక్యుమెంట్లను తయారు చేసి రిజిస్ట్రేషన్లు చేస్తూ కోట్ల రూపాయలను ఆర్జిస్తున్నారు. ప్రధానంగా పాత నేరస్తులే ఇందులో సూత్రదారులుగా ఉండి భూముల యాజమాన్య హక్కులను తారుమారు చేస్తున్నారు. అక్షరం ముక్కరాకపోయినా విలేకరులుగా చెలామణి అవుతూ చేస్తున్న దందాలకు సంబంధిత శాఖల అధికారులు వంత పాడుతుండడంతో అసలైన యజమానులు నష్టపోతున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు ఫోర్జరీ డాక్యుమెంట్లతో భూమిని రిజిస్ట్రేషన్ చేసిన సూత్రదారిని అదుపులోకి తీసుకున్న విషయం వెలుగు చూసింది. నగరంలోని రూరల్ పోలీస్ స్టేషన్ లో కొందరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము యాజమాన్యంగా ఉన్న భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఫిర్యాదు సారాంశం. పోలీసులు విచారణ చేయడంతో సంచలన విషయం వెలుగు చూసింది. నగరంలోని న్యాల్ కల్ రోడ్డుకు చెందిన వ్యక్తి దుబ్బకు చెందిన మీ సేవా నిర్వాహకుడితో కలిసి ఫోర్జరీ డాక్యుమెంట్లను తయారు చేసినట్లు గుర్తించారు. మున్సిపల్/రెవెన్యూ శాఖ జారీ చేసే డెత్ సర్టిఫికెట్ ను ఆధారం చేసుకుని ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ ను తయారు చేసి భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తించారు. కోట్ల విలువైన భూమిని మార్పిడి జరుగడంతో పోలీసులు కేసు నమోదు చేసి సదరు వ్యక్తిని మంగళవారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నట్లు అతని వద్ద డాక్యుమెంట్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గతంలోనూ సదరు వ్యక్తి పై నిజామాబాద్ 1వ టౌన్ డబుల్ రిజిస్ట్రేషన్ పై నిజామాబాద్ అర్బన్ సబ్ రిజిస్ట్రార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బైపాస్ రోడ్డులో ఒక స్వచ్ఛంద సంస్థకు దానం చేసిన భూమిని సదరు కుటుంబ సభ్యుల పేరుతో డాక్యుమెంట్ తయారు చేసి రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తించారు. అయితే అప్పటికే సదరు భూమి విషయంలో కోట్ల రూపాయలు చేతులు మారాయి. పోలీసులు కేసులు నమోదు చేసినా ఆరోజు సీరియస్ గా తీసుకోకపోవడంతో మరోసారి ఫేక్ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ వ్యవహారం వెలుగు చూసింది. సదరు వ్యక్తి గతంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేగా ఇండిపెండెంట్ గా పోటీ చేసిన చరిత్ర ఉంది. మొన్నటి వరకు డిజిటల్ పత్రికకు విలేకరిగా చెలామణి అవుతూ దస్తావేజు తయారిలో ఆరితేరినట్లు తెలిసింది. నగరంలోని గాయత్రినగర్ లో ఓ స్కూల్ వద్ద ఉన్న స్థలాన్ని ఇదే మాదిరిగా ఫేక్ డాక్యుమెంట్లతో అమ్మేసినట్లు తెలిసింది. ఈ విషయంలో విలేకరినని చెబుతూ కేసుల నుంచి సులువుగా తప్పించుకుంటున్నట్లు సమాచారం. నిజామాబాద్ నగరంలోని న్యాల్ కల్ రోడ్డులో ని లలితాంబ ఆశ్రమం తర్వాత ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ సమీపంలో 4 ప్లాట్లను కొందరు వ్యక్తులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసేసి విక్రయించారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. అందులో విలేకరులే దస్తావేజులేఖరులుగా డాక్యుమెంట్లు తయారి చేసి రూ.48 లక్షలకు సదరు భూమిని బోధన్ రోడ్డు లోని ఓ టిఫిన్ సెంటర్ నిర్వాహకుడికి విక్రయించినట్లు తెలిసింది. సంబంధిత భూమిని మార్టిగేజ్ లోన్ ద్వారా వాటాలు వేసి పంచుకోవడం విశేషం. ఇటీవల ఈ వివాదం తెరపైకి రావడంతో మాజీ మేయర్ ఇంటి వద్ద పంచాయితీ జరిగినట్లు తెలిసింది. సంబంధిత ప్లాట్లకు ఒరిజినల్ యజమానులు వచ్చి కొత్తగా కొనుగోలు చేసిన వారు హద్దులు పాతేందుకు ప్రయత్నించగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థికి పాముకాటు

ఉదయం 12 గంటల ప్రాంతం లో సదరు విద్యార్థి కాలకృత్యాలకు వెళ్లే సమయంలో ఏదో విష కీటకం విద్యార్థికి కాటు వేసినట్లు సమాచారం. తీవ్రమైన నొప్పి రావడం తో సదరు విద్యార్థి బాధపడడంతో వెంటనే పాఠశాలలోని సదరు ఉపాధ్యాయుడు గమనించి చికిత్స నిమిత్తం దేవాన్ష్ ని తన వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఆసుపత్రిలో వైద్యుడు బాలుడికి వైద్య పరీక్షలు చేస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్యం నిలకడగానే ఉంది. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

**మరుగుదొడ్ల చుట్టూ పిచ్చి మొక్కలు**

బోర్గాం ప్రైమరీ పాఠ శాలలో మరుగుదొడ్లు చుట్టూ ప్రాంతమంతా పిచ్చి మొక్కలతో గడ్డి పెరగడంతో విష కీటకాలకు నిలయంగా మారింది. పూర్తిగా పాఠశాలలో చదివే విద్యార్థులకు భద్రత కరువైంది. గతంలో కూడా పలుమార్లు పాము వచ్చిన సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. ఎప్పటికప్పుడు విద్యార్థుల భద్రతపై ఉపాధ్యాయులు పర్యవేక్షణ చే యాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంతే కాకుండా పాఠశాలలో మధ్యాహ్న భోజన మెనూ కూడా మొక్కుబ డిగానే మమ అనిపిస్తున్నారు. మెనూ విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లినా తీరు మారలేదు. పూర్తి స్థాయిలో మెనూ పాటించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు అన్ని సౌకర్యాలు అందుతాయని నమ్మకాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు కల్పించేలా ప్రైమరీ పాఠశాల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# రూ.42.80 కోట్లతో రహదారులకు మహర్దశ

ఫేజ్ - 1 కింద రూ.42.80 కోట్ల వ్యయంతో మొత్తం 71.63 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. రామారెడ్డి మండల పరిధిలోని పోసానిపేట, రంగంపేట గ్రామాల సరిహద్దులో ఉన్న మోషంపూర్ చౌరస్తా వద్ద పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ తో కలిసి మంగళవారం రహదారి అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈ రహదారుల అభివృద్ధితో గ్రామాల మధ్య రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు రైతులు, విద్యార్థులు, వ్యాపారులు, సామాన్య ప్రజలకు ప్రయాణ ఇబ్బందులు తగ్గనున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఈ రహదారులు ఎంతో దోహదపడనున్నాయన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు సైతం మెరుగైన రహదారి సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. ప్రజల అవసరాలను గుర్తిస్తూ గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు.

# ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చొద్దు

**బీసీ-ఏలోని 57 ఉపకులాలకు అన్యాయం చేయవద్దు**

**ముఖ్యమంత్రి ప్రకటనను వెనక్కి తీసుకోవాలి**

**బీసీ-ఏ జేఏసీ జిల్లా అధ్యక్షులు పల్లికొండ అన్నయ్య, కన్వీనర్ మాడవేడి వినోద్ కుమార్**

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : బీసీ-డి గ్రూపులో ఉన్న ముదిరాజ్‌లను బీసీ-ఏ గ్రూపులో చేర్చుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీసీ-ఏ జేఏసీ నిజామాబాద్ జిల్లా నాయకులు తెలిపారు. బీసీ-ఏలోని 57 ఉపకులాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి తన ప్రకటనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం కేర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన బీసీ-ఏ జేఏసీ జిల్లా సమావేశంలో జేఏసీ జిల్లా అధ్యక్షులు పల్లికొండ అన్నయ్య గంగపుత్ర, జిల్లా కన్వీనర్ మాడవేడి వినోద్ కుమార్ గంగపుత్ర మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కులగణన లెక్కల ప్రకారం రాష్ట్ర బీసీ జనాభాలో ముదిరాజ్ సామాజిక వర్గం గణనీయమైన జనాభా కలిగి ఉందని పేర్కొన్నారు. ఆర్థిక, రాజకీయ, సాగుభూమి తదితర అంశాల్లో బీసీ-ఏలోని అనేక ఉపకులాలతో పోలిస్తే ముదిరాజ్ సామాజికవర్గం మెరుగైన స్థితిలో ఉందని వారు అభిప్రాయపడ్డా రు.బీసీ-ఏ గ్రూపులోని 57 ఉపకులాల్లో అనేక కులాలకు ఇప్పటికీ తగిన రాజకీయ ప్రాతినిధ్యం లేదని, సర్పంచ్,?ఎంపీటీసీ వంటి స్థానాలకు కూడా చేరుకోలేని పరిస్థితుల్లో అనేక



సామాజికవర్గాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికీ కొన్ని కులాలు సంచార జీవనం సాగిస్తూ,సంప్రదాయ కులవృత్తులపైనే ఆధారపడి జీవిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో బిసి ల పరంగా రాష్ట్రంలోనే అధిక జనాభా కలిగిన సామాజికవర్గాన్ని బీసీ-ఏలో చేర్చడం వల్ల ఇప్పటికే వెనుకబడిన చిన్న ఉపకులాలకు విద్య, ఉద్యోగాలు, రిజర్వేషన్ అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యంలో నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.అందువల్ల ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవా లని, బీసీ-ఏలోని 57 ఉపకులాల హక్కులు, అవకా శాలను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు రజక, నాయకులు నగేష్ ఒడ్డెర,అనిల్ నాయీబ్రాహ్మణ, లక్ష్మీనారాయణ మేదర, రమేష్ కూనపులి, శ్రీనివాస్ ఎల్లాపి, మురళి,పాక శంకర్, గంగాప్రసాద్, సత్యనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ 2008 కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడు రాజు మృతి పట్ల ఎస్టీయూటీఎస్ సంతాపం

### పరామర్శించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్



మాచారెడ్డి, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం రత్నగిరి పల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న డీఎస్సీ 2008 కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడు రాజు అకాల మరణం చెందడం పట్ల స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్టీయూటీఎస్) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అరకొర వేతనాలతో కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూ, ఆర్థిక ఇబ్బందుల మధ్య జీవితాన్ని కొనసాగించడం కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు తీవ్ర ఆవేదన కలిగిస్తున్నదని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నప్పటికీ చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాజు మరణం డీఎస్సీ 2008 కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపిందని, ఒక ఉపాధ్యాయ కుటుంబం ఎదుర్కొంటున్న ఈ విషాదం ఉపాధ్యాయ లోకాన్ని కలచివేస్తోందని తెలిపారు. కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల ఆర్థిక భద్రత, గౌరవప్రదమైన జీవనం, కుటుంబ సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా కోరారు. రాజు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఈ తీరని దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు పర్వత్ రెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కలీమొద్దీన్, శ్రీనివాస్, నరేష్ గౌడ్, త్రినాథ మూర్తి, లింగం,శివ శంకర్ తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన టీజీవీపీ నాయకులు



మాక్లూర్, బతుకమ్మ : తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో మాక్లూర్, బోర్గాం(పి) ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా టీజీవీపీ నగర అధ్యక్షుడు అఖిల్ మాట్లాడుతూ మాక్లూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 180 కి పైగా ఉన్నప్పటికీ కేవలం ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే క్లాసులు కంబైన్డ్ చేయకుండా తీవ్ర ఇబ్బందుల నడుమ చదువు చెబుతున్నారని, దీనిపై డిఈవో, ఎంఈవోలకి ఫిర్యాదు చేసినా అధికారుల నుండి స్పందన లేదని హెడ్‌మాస్టర్ ఆవేదన వ్యక్తం చేశారన్నారు. అలాగే 350 మంది విద్యార్థులున్న మాక్లూర్ హైస్కూల్‌లో మిగతా సబ్జెక్టులకు ఇద్దరేసి టీచర్లు ఉన్నా, తెలుగు , హిందీ సబ్జెక్టులకు మాత్రం కేవలం ఒక్కొక్క టీచరే ఉండటంతో క్లాసులు కంబైన్డ్ చేసి చెప్పాల్సి వస్తోందని మండిపడ్డారు. పాఠశాలలో కనీస వసతులు కరువయ్యాయని, విద్యార్థులకు తాగడానికి వాటర్ ప్లాంట్ ఉన్నప్పటికీ అది రిపేర్ రావడం వల్ల పని చేయడం లేదని, ఫ్యాకల్టీ వద్ద వివరాలు అడగగా అది రిపేర్‌లో ఉందని చెప్పారని దీంతో విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో బోర్ నీళ్లు తాగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల్లోగా మాక్లూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అదనపు ఫ్యాకల్టీని కేటాయించకపోయినా, హైస్కూల్‌కు తెలుగు, హిందీ టీచర్లను నియమించకపోయినా,వాటర్ ప్లాంట్‌ను బాగు చేయించకపోయినా విద్యాశాఖ అధికారులు స్పందించకపోతే టీజీవీపీ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున మండల విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీజీవీపీ నాయకులు హేమంత్, సన్నీ, సాయి,నైతిక్, గౌరీష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ యూనివర్సిటీకి రెండు పోస్టులే కేటాయించడం అన్యాయం

### వీసీకి పిడిఎస్ యూ వినతి

డిచ్ పల్లి, బతుకమ్మ : తెలంగాణ యూనివర్సిటీకి కేవలం రెండు పోస్టులు మాత్రమే కేటాయించడం సరైంది కాదని పి డి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రికి పిడిఎస్ యూ తెయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ యూనివర్సిటీ లో ఇప్పటికే అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కొరత ఉందని. యూనివర్సిటీ పరిపాలన, విద్యాబోధనలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో కేవలం రెండు పోస్టుల కేటాయింపు విశ్వవిద్యాలయ అభివృద్ధికి,విద్యార్థుల భవిష్యత్తుకు ఆటంకంగా మారే ప్రమాదం ఉందనీ,తెలంగాణ యూనివర్సిటీలో గత రెండేళ్లలో అనేక కోర్సులు రావడం జరిగిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపక, బోధనేతర పోస్టులను కేటాయించి వెంటనే నియామకాలు చేపట్టాలి. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలన్నింటికీ సమానమైన ప్రాధాన్యతనిస్తూ, తెలంగాణ యూనివర్సిటీకి అవసరమైన నిధులు, మౌలిక సదుపాయాలు, అధ్యాపక పోస్టులు కల్పించాలని, కేవలం రెండు పోస్టులతో యూనివర్సిటీలోని సిబ్బంది కొరతను ఎలా అధిగమిస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. అన్ని యూనివర్సిటీలలో ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేసి మిగితా పోస్టులను ప్రభుత పోస్టులు కేటాయించాల ని,ఖాళీలన్నింటినీ భర్తీ చేసే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో విద్యార్థులు, అధ్యాపకులు, ప్రజాసంఘాలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు




చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెయూ పిడీఎస్ యూ నవదీప్, జ్ఞానేశ్వర్, నితిన్,రాజు తదితదిరులు పాల్గొన్నారు.

# మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మ దహనం

కామారెడ్డి, బతుకమ్మ : దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాం సాగర్ చౌరస్తా లో మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు మాట్లాడుతూ దేశ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారిపై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, దేశ అత్యున్నత పదవిలో ఉన్న ప్రధానమంత్రి గారి పట్ల గౌరవప్రదమైన భాషను ఉపయోగించాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇలాంటి వ్యాఖ్యలతో దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీయడం మానుకోవాలని, ప్రధానమంత్రి పట్ల చేసిన వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజల విశ్వాసాన్ని పొందిన నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేసినంత మాత్రాన ప్రజల్లో ఉన్న మోదీ ఆదరణను తగ్గించలేరని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమం



ద్వారా కాంగ్రెస్ పార్టీ వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని జిల్లా బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, పట్టణ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు

# కళారంగంలో బత్తుల హరీష్‌కు మహానంది పురస్కారం

### ఘనంగా సత్కరించిన విశ్వ తేజస్ బృందం



డిచ్ పల్లి, బతుకమ్మ : నిజామాబాద్ జిల్లా యానంపల్లి గ్రామానికి చెందిన కళాకారుడు బత్తుల హరీష్‌కు కళారంగంలో విశేష కృషికి గుర్తింపుగా మహానంది పురస్కారం లభించింది. తెలుగు సాహితీ సంస్కృతి సేవా ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో విశాఖ పట్నంలోని పబ్లిక్ లైబ్రరీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. బత్తుల హరీష్ ప్రేమకావ్యం, అఘోర చిత్రాల్లో నటించి తన ప్రతిభను చాటుకున్నారు. కళారంగంపై ఆసక్తి, అంకితభావంతో ముందుకు సాగుతున్న ఆయనకు ఈ పురస్కారం లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బత్తుల హరీష్ సాధించిన ఘనతను అభినందిస్తూ విశ్వ తేజస్ బృందం ఆయనను ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో విశ్వ తేజస్ సంస్థ వ్యవస్థాపకులు తిరునగరి శ్రీహరి మాట్లాడుతూ కళారంగంపై హరీష్‌కు ఉన్న అంకితభావం, కళాతృష్ణ అభినందనీయమని పేర్కొన్నారు. పట్టుదలతో తన కళా ప్రయాణాన్ని కొనసాగిస్తూ మరిన్ని విజ యాలు సాధించాలని ఆకాంక్షించారు.గ్రామీణ ప్రాంతం నుంచి సినీ రంగంలో తనకంటూ గుర్తింపు తెచ్చుకుంటున్న బత్తుల హరీష్‌కు మహానంది పురస్కారం లభించడం యానంపల్లి గ్రామంతో పాటు నిజామాబాద్ జిల్లాకు గర్వకారణమని విశ్వ తేజస్ బృందం పేర్కొంది.

# ఖచ్చితంగా ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్

### బాలికల జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసిన డిఐఈవో



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ మంగళవారం నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గంధం బుద్ధిరాజ్ అధ్యక్షతన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి అధ్యాపకుడు సమయాపాలన పాటిస్తూ ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ వేయాలని ఆదేశించారు. అలాగే ప్రతి క్లాస్ ఇన్చార్జి అధ్యాపకులు విద్యార్థినిల ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ ను ఉదయం 10:30 గంటలలోగా తీసుకొని ఫార్వర్డ్ చేయాలని ఆదేశించారు. ఇంకా అటెండెన్స్ లో ఫేస్ రికగ్నిషన్ చేయని విద్యార్థుల చేత వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే విద్యార్థులను ప్రాక్టికల్స్ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ప్రాక్టికల్స్ తరగతులు ప్రారంభించాలని ఆదేశించారు. డిసెంబర్ వరకు సిలబస్ మొత్తం పూర్తి చేయడంతో పాటు తరగతుల రివిజన్ ప్రారంభించాలని ఆదేశించారు.

# టీకాల విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ



ఇందూర్, బతుకమ్మ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖలోని జాతీయ టీకాలని యంత్రణ విభాగంను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు టీకాల స్టాక్ రూంను, వాక్ ఇన్ కూలర్ ను, టెంపరేచర్ రికార్డింగ్ రిజిస్టర్ లను, టీకాల డిస్ట్రిబ్యూషన్ రిజిస్టర్ లను, వివిఎం స్టేటస్ ను, టీకాలకు విద్యుత్ సంఫరా ఏ విధంగా జరుగుతుంది, టీకాలను క్రమ పద్ధతిలో నిలువ చే యడం లాంటి విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి వివిధ అంశాలపై పలు సూచనలు చేశారు. టీకాలను ఇండెంట్ ద్వారా సరఫరా చేయా లని, ఇందులో పని చేసే సిబ్బంది అందరూ సమయపాలన పాటిం చాలని, టెంపరేచర్ రికార్డును రోజుకు రెండుసార్లు చేయాలని, ఎక్కడ ఏపీఎస్సీలో వ్యాక్సిన్ కొరత లేకుండా సకాలంలో సరఫరా చేయాలని అన్నారు. తనిఖీ సమయంలో జిల్లా టీకాల నియంత్రణ అధికారి డాక్టర్ అశోక్, మనోహర్, వినోద్, శ్యామల, సిబ్బంది పాల్గొన్నారు.

## డిక్షనరీల సహాయంతో ఇంగ్లీష్ భాష పై పట్టు సాధించాలి

### మున్సిపల్ చైర్మన్ బొదిరే నాగమణి స్వామి



భీమ్ గల్, బతుకమ్మ :ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఇంగ్లీష్, తెలుగు డిక్షణరీలను చదువుతూ ఇంగ్లీష్ భాషపై విద్యార్థులు గట్టి పట్టు సాధించాలని మున్సిపల్ చైర్మన్ బొదిరే నాగమణి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఎం శ్రీ జడ్పిహెచ్ ఎస్ స్కూల్ లో డిక్షనరిలను విద్యార్థులకు పంపిణి చేశారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులు ఇంగ్లీష్ భాషను సులువగా నేర్చుకొనేందుకు ఈ డిక్షనరీలు ఉచితంగా అందించడం గొప్ప విషయమన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ స్వామి, లింబాద్రి,వాసుదేవ్, భూమేశ్వర్, రాజ్ కుమార్, తిరుపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి నిల్వల పనులు భవిష్యత్తులో ఎంతో అవసరం

### ఫారం ఫండ్ నిర్మాణాలపై సంతృప్తిని వ్యక్తం చేసిన డిఆర్ డీఏ ఏ పీ డీ డైరెక్టర్లు



భీమ్ గల్, బతుకమ్మ :వ్యవసాయ క్షేత్రాల వద్ద నీటిని నిల్వ ఉంచేందుకు నిర్మితం అవుతున్న ఫారం ఫండ్ లు భవిష్యత్ లో ఎంతో అవసరమని డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్స్ గంగ మోహన్, శ్రీనివాస్ రెడ్డి, ఓంపాల్ లు అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో వి బిజిరామ్ జీ కింద నిర్మితం అవుతున్న ఫారం ఫండ్, కమ్యూనిటీ హార్వెస్టింగ్ ఇంకుడు గుంతల నిర్మాణం పనులను, నర్సరీల నిర్వహణను సందర్శించారు. ఇందులో భాగంగా మండలంలోని పెద్దమ్మ కాడి తండా వద్ద ఫారం ఫండ్, కమ్యూనిటీ హార్వెస్టింగ్, ఇంకుడు గుంతలను, నర్సరీని సందర్శించారు. సికిం ద్రాపూర్ లోని ఓ రైతు పొలం వద్ద నిర్మితం అవుతున్న ఫారం ఫండ్ ను సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ముందు నీటి అవసరాల దృష్ట్యా పెద్ద మొత్తంలో ఈ ఫారం ఫాండ్ నిర్మించుకోవాలని సూచించారు. మండల అధికారులు ఇలాంటి ఉపయోగకరమైన నిర్మాణం పనులను ఎక్కువగా గుర్తించి, ఎక్కువ మందికి జీవనోపాధిని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం లో ఆయా గ్రామాల సర్పంచులు, ఏ పీ ఓ నర్సయ్య, పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

## ప్రమాదవశత్తు చెరువులో పడి వ్యక్తి మృతి..




రుద్రూర్, బతుకమ్మ : రుద్రూర్ గ్రామానికి చెందిన సిరిగంధపు లక్ష్మణ్ చెరువులో పిట్టలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్ఐ రామ్ పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మణ్ చెరువులో పిట్టలను పట్టడానికి వెళ్లి వారం రోజులు గడుస్తున్న తిరిగి ఇంటికి రాకపోవడంతో మృతుని అన్న సిరిగంధపు నారాయణ మంగళవారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని చెరువులో నుండి బయటకు తీయించి, పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుని అన్న సిరిగంధపు నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# ఎలినినో ప్రభావం నేపథ్యంలో వరి సాగుకు దూరంగా ఉండాలి...

### -ఆరుతడి పంటల సాగుతో నీటి పొదుపు సాధించాలి

### -వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్ వెల్లడి



ఇందల్వాయి,బతుకమ్మ :ఇందల్వాయి మండలం లోని నల్లవెల్లి తో పాటు స్టేషన్ తండా గ్రామాల్లో సూపర్ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో భూగర్భ జలాలు రోజురోజుకూ తగ్గిపోతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులకు ఆరుతడి పంటల సాగుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ రైతులకు సూచించారు ఈ మేరకు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి రైతులకు పలు సూచనలు చేశారు. రాబోయే సాగు సీజన్‌లో నీటి లభ్యతపై అనిశ్చితి, భూగర్భ జలమట్టాలు తగ్గిపోవడం వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగు చేపట్టకుండా, వీలైనంత వరకు ఆరుతడి పంటల వైపు మళ్లాలని విజ్ఞప్తి చేశారు . ముఖ్యంగా నీటి వనరులపై అధిక ఒత్తిడి పడకుండా, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. వరి పంటకు ఎక్కువ నీరు అవసరమవుతుందని, అదే నీటితో సుమారు ఒక ఎకరం వరి సాగు చేసే నీటిని బట్టి 3--4 ఎకరాల ఆరుతడి పంటలను సాగు చేసే అవకాశం ఉంటుందని వివరించారు. అందువల్ల రైతులు నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుకొని, వర్షాభావ పరిస్థితులను తట్టుకోగల పంటలను ఎంచుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో జొన్న, ఆముదం, వేరుశనగ, కుసుమ, నువ్వులు, పెసర, మినుము వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఆయా ప్రాంతాల్లోని నేల స్వభావం, విత్తే సమయం, అందుబాటులో ఉన్న నీటి వనరులు, స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. నీటి వనరులను సంరక్షించుకోవడం, భవిష్యత్తులో సాగునీటి కొరతతో రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు ప్రణాళికతో పంటల మార్పిడి చేపట్టడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లవెల్లి పీఏసీఎస్ చైర్మన్ నోముల శ్రీనివాస్ రెడ్డి, స్టేషన్ తండా ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఏఈఓ రామకాంత్ పాల్గొన్నారు. ఆయా గ్రామాల రైతులు కార్యక్రమంలో పాల్గొని ఆరుతడి పంటల సాగుపై అవగాహన పొందారు.

# మాదిగల అభివృద్ధి మా లక్ష్యం

### సీనియర్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చిట్యాల సాయన్న






తాడ్వాయి, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని మా గార్డెన్ ఫంక్షన్ హాల్లో మాదిగల అభివృద్ధి మా లక్ష్యం సీనియర్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చిట్యాల సాయన్న అధ్యక్షున సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లారం రత్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామచందర్ భలేరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సంజీవరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర రాంచంధర్, రాష్ట్ర కార్యదర్శి రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మార్పీఎస్ వర్గీకరణకు సీఎం రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే గౌరవిస్తూ ఎమ్మార్పీఎస్ వర్గీకరణ చేయడం జరిగిందని,అదేవిధంగా అంబేద్కర్ అభయ హస్తం క్రింద 12 లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చిన ప్రభుత్వ భూములకు అన్ని హక్కులు కల్పిస్తూ సౌకర్యం కల్పించాలని కోరుతున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మార్పీఎస్ వర్గీకరణ వెంటనే ఎలాగైతే అమలు చేశాడో వీటిని కూడా వెంటనే అమలు చేయాలని కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇందల్వాయి మండలానికి కేటాయించాలి...

### బంజారా సోదరులకు ఒక అవకాశం కల్పించాలి

### పిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

### ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి నిజామాబాద్ రూరల్ అభివృద్ధికి సహకరించాలి

### ఇందల్వాయి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు మోతిలాల్ విజ్ఞప్తి



ఇందల్వాయి,బతుకమ్మ :నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని బంజారా సోదరులకు కట్టబెట్టాలని ఇందల్వాయి మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ మోతిలాల్ ఆధ్వర్యంలో బంజారా తండాల సర్పంచ్లతో కలిసి మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బానోత్ మోతిలాల్ మాట్లాడుతూ నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఇందల్వాయి మండలానికి చెందిన బంజారా సోదరులకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు, ప్రతిసారి మోపాల్ మండలానికి ఏఎంసీ చైర్మన్ ను ఎన్నుకోవడం సరైన పద్ధతి కాదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు, ఇందల్వాయి మండలంలో సుమారు 17 తండాలు ఉన్నాయని ఓటర్లు సైతం పెద్ద ఎత్తున ఉండడంతో తమకు ఒక సారి అవకాశం కల్పించాలని పిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే అభివృద్ధి ప్రదాత డాక్టర్ రేగులపల్లి భూపతిరెడ్డి తో పాటు బోధన్ శాసనసభ్యులు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సైతం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ మోతిలాల్ నాయక్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బంజారా సోదరులు ఎంతో కృషి చేశారని ఆయన గుర్తు చేశారు, ఆయన వెంట 12 తండాలకు చెందిన సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు ఉన్నారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు సుదర్శన్ నాయక్, పాలె రాజు, శిరీష మహిపాల్ నాయక్, సంగీత దిలీప్ కుమార్, గణేష్ నాయక్, మాజీ ఎంపిటిసి పరుశురాం నాయక్, మాజీ సర్పంచ్ రాములు నాయక్, వనిత కుమార్ తదితరులు ఉన్నారు

# ఫామ్‌హౌస్‌లో కలకలం

### రిటైర్డ్ ఎస్ఐ కుమారుడు అనుమానాస్పద మృతి



మేడ్చల్, బతుకమ్మ : మేడ్చల్ మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఏదులాబాద్‌లోని ఓ ఫామ్‌హౌస్‌లో పుట్టినరోజు వేడుకలకు వెళ్లిన రిటైర్డ్ ఎస్ఐ కుమారుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. ఉప్పల్ భగాయత్‌కు చెందిన రిటైర్డ్ ఎస్ఐ సి. ప్రవీణ్ కుమార్ కుమారుడు కృష్ణ కౌండిన్య (21) బీటెక్ పూర్తి చేశాడు. తన స్నేహితుడు ఘన్‌కోట్ రిషబ్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు కృష్ణ కౌండిన్య ఏదులాబాద్‌లోని లివిన్ ఫామ్‌హౌస్‌కు వెళ్లాడు. అయితే?పార్టీ జరుగుతున్న సమయంలో కృష్ణ కౌండిన్య ఫామ్‌హౌస్‌లో అపస్మారక స్థితిలో పడిపోయాడని రిషబ్ తండ్రి రిటైర్డ్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే యువకుడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తన కుమారుడి మృతిపై పలు అనుమానాలున్నాయని తండ్రి ప్రవీణ్ కుమార్ ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అసలు పుట్టినరోజు వేడుకల్లో ఏం జరిగింది? మృతికి గల అసలు కారణాలు ఏమిటనే కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. యువకుడి అకస్మాత్ మరణంతో కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ఇందిరమ్మ రాజ్యంలో గ్రామాలు అభివృద్ధి బాటలో దూసుకుపోతున్నాయి





**ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి..**

**ధర్పల్లి మండలంలో రూ.1.60 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమిపూజలు**

**విద్య, మౌలిక వసతులు, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట**

**ఎల్‌నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి.. ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి**

ఇందల్వాయి, బతుకమ్మ:ఇందిరమ్మ రాజ్యంలో గ్రామాలు అభివృద్ధి బాటలో దూసుకుపోతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు అభివృద్ధి పనులు చేపడుతూ మరోవైపు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి అన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని స్పష్టం చేశారు.ధర్పల్లి మండలంలో మొత్తం రూ. 1.60 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి శంకుస్థాపనలు, భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోబిన్ సాబ్ తండాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

### రూ.1.60 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు

ధర్పల్లి మండలంలో చేపట్టనున్న అభివృద్ధి పనుల వివరాలు ఇలా ఉన్నాయి.
మహిళా సమాఖ్య భవనం నిర్మాణానికి రూ. 10 లక్షలు కేటాయించారు.
ఆదర్శ పాఠశాలల్లో ఆటస్థలాల అభివృద్ధికి రూ. 60 లక్షలు వెచ్చించనున్నారు.
కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (ఖ+దీఎ)లో మౌలిక వసతుల కల్పనకు రూ. 42 లక్షలు కేటాయించారు.
మోబిన్ సాబ్ తండా, ఎస్‌బీ తండాల్లో గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి ఒక్కో భవనానికి రూ. 20 లక్షల చొప్పున మొత్తం రూ. 40 లక్షలు కేటాయించారు.
బెలియా తండాలో రూ. 8 లక్షలతో మురుగునీటి కాలువలు, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.
ఈ పనులతో మండలంలోని గ్రామాలు, తండాల్లో మౌలిక వసతులు మరింత మెరుగుపడతాయని ఎమ్మెల్యే తెలిపారు.

### ప్రతి తండాకు అభివృద్ధి ఫలాలు

ధర్పల్లి మండలంలోని అన్ని తండాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే భూపతి రెడ్డి పేర్కొన్నారు. గ్రామాలను మండల కేంద్రానికి అనుసంధానించేలా రహదారులు నిర్మించామని, తండాల్లో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు.విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను తొలిసారిగా ధర్పల్లి మండలానికి తీసుకురావడం సంతోషకరమని అన్నారు. అలాగే, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో సుమారు రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ధర్పల్లి మండలంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయిందని, త్వరలోనే ప్రారంభించనున్నామని వెల్లడించారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హామ్) రోడ్లలో భాగంగా సుమారు రూ. 72 కోట్లతో రహదారి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు.

### అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు

ప్రతి గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గాన్ని గుడిసెలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రైతులకు విద్యుత్, సాగునీరు అందించడంలో వెనకడుగు వేయలేదని అన్నారు. రైతులను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

### మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా వడ్డీలేని రుణాలు అందిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే మహిళా సంఘాలకు రూ. 70 వేల కోట్ల రుణాలు అందించినట్లు పేర్కొన్నారు.
మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాకుండా, మహిళలను ఆర్టీసీ బస్సుల యజమానులుగా తీర్చిదిద్దే కార్యక్రమాలను కూడా ప్రభుత్వం చేపడుతోందని వివరించారు.
నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలనే లక్ష్యంతో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా (ఏటీసీ) ఉన్నతీకరిస్తున్నామని తెలిపారు.

లిఎల్‌నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలిలి

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి సూచించారు. పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని, వరి సాగుకు బదులుగా పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.
రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాలను తగ్గించుకోవచ్చని అన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ స్థిరత్వం కోసం ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

లివిద్యార్థినులతో ముచ్చటించిన ఎమ్మెల్యేలి

అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల్లో భాగంగా ముందుగా ఆదర్శ పాఠశాలల్లో చేపట్టనున్న పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (ఖ+దీఎ)లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా విద్యార్థినులతో సుమారు గంటపాటు ముచ్చటించిన ఎమ్మెల్యే వారి చదువులు, ఎదుర్కొంటున్న సమస్యలు, అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నాణ్యమైన భోజనం అందుతోందా, వసతి సౌకర్యాలు ఎలా ఉన్నాయి, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థినులను ప్రశ్నించారు. విద్యార్థినులు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.
కరువుపై ప్రతిపక్షాల ఆరోపణలు అవాస్తవం
కరువు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే వచ్చిందంటూ బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేయడం మూర్ఖత్వమని ఎమ్మెల్యే భూపతి రెడ్డి విమర్శించారు. వాతావరణ పరిస్థితులు, వర్షపాతం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.
ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, రైతులను ఆదుకోవడం, విద్యా రంగాన్ని బలోపేతం చేయడం, మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం వంటి లక్ష్యాలతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసి మాజీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేష్, నాయకులు బాల్ రాజు, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సాయరెడ్డి, పొలసాని శ్రీనివాస్, తారచంద్, ఉమ్మజి నరేష్, రాంచందర్ గౌడ్, మంగిత్య నాయక్, తదితరులు పాల్గొన్నారు..

## రుద్రూర్ ఇంచార్జ్ ఎస్సై గా ఎల్. రామ్ బాధ్యతల స్వీకరణ...

రుద్రూర్, బతుకమ్మ : రుద్రూర్ ఇంచార్జ్ ఎస్సైగా ఎల్. రామ్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. రుద్రూర్ ఎస్సై మనోజ్ కుమార్ ప్రస్తుతం సెలవులో ఉండడంతో ఆయన స్థానంలో ఇంచార్జ్ ఎస్సైగా ఎల్. రామ్ బాధ్యతలు స్వీకరించారు. సిరికొండ, బోధన్ టౌన్ లో ఎస్సై రామ్ విధులు నిర్వహించారు. అక్కడి నుండి రుద్రూర్ గ్రామానికి ఇంచార్జ్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు.



## మెండోరాలో సీసీ కెమెరాలు ప్రారంభించిన పోలీస్ కమిషనర్



మెండోరా, బతుకమ్మ : మెండోరా పోలీస్ స్టేషన్ లో మంగళవారం 54 సీసీ కెమెరాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ప్రారంభించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషమని, ఒక్క సీసీ కెమెరా అనేది 100 మంది పోలీసులతో సమానమని తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఏ.సి.పి వెంకటేశ్వర్ రెడ్డి , ఆర్మూర్ రూరల్ సి.ఐ జాన్ రెడ్డి , మెండోరా ఎస్.ఐ సుహాసిని , మెండోరా గ్రామ వీడిసి చైర్మన్ మోహన్ రెడ్డి , ప్రభాకర్ , సర్పంచ్ ప్రమోద్ , గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పల్లెల్లో గుప్పుమంటున్న నాటు సారా

**పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు**

**మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారని ఆరోపణలు**

ఇందల్వాయి,బతుకమ్మ :ఇందల్వాయి మండలంలోని గిరిజన తండాలలో విచ్చలవిడిగా నాటు సారా విక్రయాలు కొనసాగుతున్న ఎక్సైజ్ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నట్లు మండలానికి చెందిన పలువురు ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. లీటర్ నాటు సారా 200 రూపాయలకు విక్రయిస్తున్నారని మండలానికి చెందిన కొందరు మద్య ప్రియులు బతుకమ్మతో తెలిపారు. ప్రతి గిరిజన తండాలో పదుల సంఖ్యలో నాటు సారా విక్రయ కేంద్రాలు ఉన్నాయని సమాచారం. నాటు సారా విక్రయం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి భారీ ఎత్తున నష్టం జరుగుతున్న అరికట్టవలసిన అధికారులు సొంత లాభం కోసం మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారని విశ్వసనీయ సమాచారం.. మండలంలోని సుమారు 17 గిరిజన తండాలలో ఇప్పపువ్వు సార పేరుతో నల్ల బెల్లంతో తయారుచేసిన నాటు సారా ను దర్జాగా విక్రయిస్తూ తమ తమ వ్యాపారాలను మూడు పూలు ఆరు కాయలుగా మలుచుకుంటున్నారని తెలుస్తుంది. నాటుసారా తయారీపై ఎక్సైజ్ శాఖ అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ నెల నెల రావలసిన డబ్బులు ఒక కానిస్టేబుల్ ద్వారా వసూలు చేస్తున్నారని తెలిసింది, ఏది ఏమైనా జిల్లా ఎక్సైజ్ సుపారిడెంట్ ప్రత్యేక చర్యలు తీసుకొని గ్రామాల్లో గుప్పుబంటున్న నాటు సారును రూపుమాపాలని ప్రజలు ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం మరోవైపు ఆదేశాలు జారిచేస్తున్న ఆచరణలో అమలు కావడం లేదని ఇందల్వాయి మండలానికి చెందిన పలువురు ఆరోపణలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్య తీసుకుని నాటు సారా విక్రయాలు జరుగుతున్న వారిపై పిడి యాక్టు నమోదు చేసి జైలుకు పంపాలని ప్రజలు కోరుతున్నారు

## పేకాట స్థావరంపై పోలీసుల దాడులు...

**- 13,170 నగదు , ఆరు మొబైల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం...**



బోధన్, బతుకమ్మ న్యూస్ : బోధన్ పట్టణంలోని రాకాసి పేటలోని ఓ ఇంట్లో మంగళవారం రాత్రి 9 :30 గంటల సమయంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించగా, పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకొని, వారి వద్ద నుండి 13,170/- రూపాయలు, 6 మొబైల్ ఫోన్స్, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు బోధన్ ఎస్ హెచ్ ఓ తెలిపారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# జాతీయ స్థాయి క్రీడా పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### క్రీడా వేదికను పరిశీలించి అధికారులతో సమీక్షించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్ అర్బన్ , బతుకమ్మ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026-27 కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ నెలలో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న క్రీడా పోటీలకు సంబంధించి నిజామాబాద్ జిల్లాలో ఎంపిక చేసిన క్రీడా వేదికను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం పరిశీలించారు.జాతీయ స్థాయిలో మొత్తం 20 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనుండగా, టేబుల్ టెన్నిస్ పోటీల నిర్వహణకు నిజామాబాద్ జిల్లాను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ మాక్లూర్ మండలం దాస్‌నగర్ సమీపంలోని నవ్య భారతి గ్లోబల్ స్కూల్‌ను సందర్శించి, టేబుల్ టెన్నిస్ పోటీల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా వేదిక, ఇతర వసతులను పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, చేపట్టాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు.దేశవ్యాప్తంగా సుమారు 150 మంది టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాకు రానున్న నేపథ్యంలో, అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు నిజామాబాద్ జిల్లాను ఎంపిక



చేయడం ఎంతో ప్రతిష్టాత్మకమైన విషయమని పేర్కొంటూ, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు.క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సమకూర్చాలని, వారి భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. దాదాపు ఐదు రోజుల పాటు పోటీలు కొనసాగనున్నందున, క్రీడాకారుల వసతి, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు తదితర సదుపాయాలను సమన్వయంతో ఏర్పాటు చేయాలని సూచించారు.జాతీయ స్థాయి క్రీడా పోటీలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించడం ద్వారా నిజామాబాద్ జిల్లాకు



మంచి గుర్తింపు తీసుకురావాలని, ఇందుకోసం సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. క్రీడా పోటీల నిర్వహణ కోసం ఇంకనూ ఏవైనా సదుపాయాలు అవసరమైతే ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇంచార్జి డీఈఓ సాయాగౌడ్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి పవన్ కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పరమేశ్వర్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాశ్ యాదవ్, నవ్య భారతి స్కూల్ కరస్పాండెంట్ సంతోష్, లత, స్థానిక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కేసు క్లోజ్ చేయడానికి లంచం

### ఏసీబీకి పట్టుబడిన సీఐ, హోం గార్డ్




హైదరాబాద్, బతుకమ్మ :స్టేషన్ లో నమోదు చేసిన కేసు ను క్లోజ్ చేయాలి, భవిష్యత్తు లో వేధించకుండా ఉండేందుకు లంచం తీసుకుంటు పోలీస్ స్టేషన్ సీఐ, హోం గార్డ్ లు ఏసీబీకి చిక్కారు. హైదరాబాద్ సిటీ రేంజ్ 1ఏసీబీ అధికారులు మంగళవారం హైదరాబాద్ లోని మీర్ చౌక్ పోలీస్ స్టేషన్ పై దాడి చేసారు. పోలీస్ స్టేషన్ లో నమోదు అయినా కేసుకు సంబందించిన కేసు క్లోజ్ చేయడానికి, ఫ్యూచర్ లో వేదించ కుండా ఉండటానికి రూ. 6 లక్షలు లంచం డిమాండ్ చేసారు మీర్ చౌక్ సీఐ ఏడు కొండలు. బాధితుడు ఏసీబీ ని ఆశ్రయించారు. మొదటి విడతలో మూడు లక్షలు లంచం ను హోం గార్డ్ అభిద్ అలీ ధ్వరా లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గ పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి నాంపల్లి ఏసీబీ కోర్ట్ ముందు హాజరు పరుచగా నాయస్థానం వారికీ రిమాండ్ విధించింది

# మంత్రి పర్యటన వేళ బాన్సువాడలో ముందస్తు అరెస్టులు

### బీఆర్ఎస్ నాయకులతో పాటు కాంగ్రెస్ నాయకుల అరెస్టు

బాన్సువాడ, బతుకమ్మ : తెలంగాణ మంత్రి సీతక్క బాన్సువాడ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వస్తున్న నేపథ్యంలో పోలీసులు పలువురు నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టుల్లో బీఆర్ఎస్ నాయకులతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు కూడా ఉండటం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.అయితే, అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులను సైతం అరెస్టు చేయడం ఆ పార్టీలో అంతర్గత విభేదాలు ఉన్నాయనే చర్చకు దారితీసింది.అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ వార్డు సభ్యుడు మోచి గణేష్,



ఖలీల్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి గణేష్, కొత్తకొండ భాస్కర్, మాసాని శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, దేవేందర్ రెడ్డి, జరుపాల్ మోతిలాల్, తారానాయక్ తదితరులు



ఉన్నారు.మంత్రి పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న ఈ ముందస్తు అరెస్టులు బాన్సువాడ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు తెరలేపాయి.

### సాధ్యమైత తొందరగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రినీ

# నూతన భవనంలోని మార్చాలి

### కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి



కామారెడ్డి, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి పరిశీలించారు. మంగళవారం అధికారులతో మాట్లాడుతూ సాధ్యమైత తొందరగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నీ నూతన భవనంలోని మార్చాలని అన్నారు. కాంట్రాక్టర్ లు నిర్మాణ పనులు వేగవంతం చేయాలనీ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనంలోకి మారక ముందే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందే చర్యలు తీసుకోవాలనీ అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ఆర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్ లు పాల్గొన్నారు.



# ఎల్ నినో నేపథ్యంలో ఆరుతడి పంటలనే సాగు చేయాలి

### ఖరీఫ్ పంటను గట్టెక్కిస్తాం...రబీలో మాత్రం వరి వేస్తే కాపాడలేం
### ఆరుతడి సాగుకు అన్నివిధాలుగా తోడ్పాటును అందిస్తాం
### కొత్తగా బోరుబావులు తవ్విస్తే సీజ్ చేస్తామని స్పష్టీకరణ

నందిపేట్ , బతుకమ్మ : ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రైతులు రబీలో ఆరుతడి పంటలనే సాగు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల లభ్యత, విద్యుత్ సరఫరా తదితర పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఒకవేళ వరి మినహా ఇతర పంటల సాగుకు చౌడు భూములు వంటి నేల రకాలు సహకరించకపోతే క్రాప్ హాలిడే పాటించాలని, వరి సాగు మాత్రం చేయవద్దని స్పష్టం చేశారు. నందిపేట మండలం నూత్ పల్లి రైతు వేదికలో మంగళవారం ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులనుద్దేశించి మాట్లాడారు. ఖరీఫ్ లో వేసిన వరి పంట పూర్తి స్థాయిలో చేతికి అందేంత వరకు జిల్లా యంత్రాంగం తరపున కాపాడుతామని రైతులకు భరోసా కల్పించారు. అయితే రబీలో మాత్రం వరి పంటకు సాగు నీరు అందించే పరిస్థితి ఉండదని కలెక్టర్ వెల్లడించారు. సూపర్ ఎల్ నినో ప్రభావంతో ప్రతీకూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై రైతులకు కీలక సూచనలు చేశారు. వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే పెసలు, మినుములు, శనగతో పాటు జొన్న, మొక్కజొన్న, కూరగాయలు వంటి పంటల సాగును చేపట్టడం ఎంతో శ్రేయస్కరమని రైతులను ప్రోత్సహించారు. బిందు సేద్యాన్ని వినియోగించుకొని ఆయిల్‌పామ్ తోటలు,



కూరగాయలు తదితర పంటలను సాగు చేయడం ద్వారా నీటిని పొదుపుగా వినియోగించుకోవచ్చని అన్నారు. ఆరుతడి పంటల సాగుకు ముందుకు వచ్చే రైతాంగానికి ప్రభుత్వ పరంగా జిల్లా యంత్రాంగం తరపున తోడ్పాటును అందిస్తామని భరోసా కల్పించారు. మల్చింగ్, బిందు సేద్యం విధానాలకు రాయితీ వర్తించేలా ప్రణాళికలు రూపొందిస్తామని అన్నారు. కూరగాయలు, ఇతర ఆరుతడి పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే దిశగా కూడా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వీబీజీరాంజీ కింద ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోరు బావుల రీఛార్జ్ వంటి పనులను చేపట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించుకోవడంపై దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. అయితే ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో కొత్తగా బోరుబావులు తవ్వకూడదని, ఎవరైనా తవ్విస్తే వాటిని సీజ్



చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రధాన జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను తాగునీటి అవసరాలకే వినియోగిస్తామని కలెక్టర్ తెలిపారు. భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయని, రానున్న రోజుల్లో సేద్యానికి కరెంటు సరఫరాకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని, యాసంగిలో వరి సాగు చేసి ఇబ్బందుల్లో పడవద్దని జిల్లా పాలనాధికారి హితవు పలికారు. ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక మహిళా సంఘాల ప్రతినిధులు సైతం రబీలో రైతులు ఆరుతడి పంటలే సాగు చేసేలా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహిస్తూ వారికి అవగాహన కల్పించాలని అన్నారు.

ఈ సందర్భంగా ఆదర్శ రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించగా, రబీలో ఏ తరహా పంటలు సాగు చేయవచ్చు, కరువు పరిస్థితులను అధిగమించేందుకు అనుసరించాల్సిన విధానాలు ఏమిటీ తదితర అంశాలపై వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్ రావు, ఉద్యానవన శాఖ అధికారిణి సంధ్య, సర్పంచ్ రాజిరెడ్డి, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఆల్ర్పాజోలం పట్టుకున్న పోలీసులు

మోస్రా, బతుకమ్మ : మోస్రా గ్రామంలో 38.42 గ్రాముల ఆల్ర్పాజోలం స్వాధీనం చేసుకున్నట్లు వర్ని ఎస్సై కృష్ణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారం మేరకు మోస్రా గ్రామానికి చెందిన బొజ్జ స్వామి గౌడ్ కల్లు వ్యాపారి వద్ద తనిఖీలు చేయగా 38.42 గ్రాముల ఆల్ర్పాజోలం లభించగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.విచారణలో సదరు వ్యక్తి సుమారు 50 గ్రాముల ఆల్ర్పాజోలంను రూ.50,000లకు కొనుగోలు చేసి, కల్లు అమ్మకాలను పెంచి అధిక లాభాలు పొందాలనే ఉద్దేశంతో కల్లులో కలుపుతున్నట్లు తెలిపాడు.

# ఎదుటి వారి మీద ఏడుసుడే, ఏలుడు చాతకాదు..!

**నీళ్లు, కరెంట్ ఇవ్వాలేమని చేతులెత్తేసి కరువును తెచ్చిన కాంగ్రెస్**

**కేసీఆర్, బీయర్ఎస్ లపై ఏడ్చుడు ఆపి హామీల అమలుపై దృష్టి సారించాలని సీతక్కకు హితవు**

**మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**

హైదరాబాద్, బతుకమ్మ :ఆడలేక మద్దెల దరువు అన్నట్టు.. మీకు పరిపాలన చేతకాక,మూడు ఏడెండ్ల నుండి కేసీఆర్ మీద, గత బీఆర్ ఎస్ ప్రభుత్వం మీద ఏడుస్తూనే కాలం వెళ్ళదీస్తున్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. వేల్పూర్ పర్యటనలో జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క చేసిన వ్యాఖ్యలకు స్పందించిన ఆయన బతుకమ్మతో మాట్లాడారు.పంటలు వేయొద్దు..నీళ్లు,కరెంట్ ఇవ్వలేము..అనీ కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసి కరువు పేరుతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు.ఇది కాలం తెచ్చిన కరువు కాదని, చేతకానీ కాంగ్రెస్ తెచ్చిన కరువని దుయ్యబట్టారు.ఈ సారి వర్షపాతం తగ్గుతుందని, కరువు ఉంటుందని 8 నెలల క్రితమే నిపుణులు హెచ్చరించిన కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందన్నారు.మేడిగడ్డ వద్ద వందలాది టీఎంసీల ప్రాణహిత,గోదావరి నీరు వృథాగా సముద్రంలో కలుస్తున్నజకన్నెపల్లి పంపులు నడిపి నీళ్లు ఎత్తకుండా ఈ ప్రభుత్వం చేతులెత్తేస్తున్నదన్నారు.ఏపీలో పక్కనే ఉన్న చంద్రబాబు నాయుడు పట్టిసీమ ద్వారా గోదావరి నీళ్లను, కృష్ణ నీళ్లను 600 కి. మి దూరంలో ఉన్న కుప్పం కి తీసుకెలుతుంటే....రేవంత్ రెడ్డి ప్రభుత్వం అవకాశం ఉన్నా కాళేశ్వరం ద్వారా కేసీఆర్ కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనని 100 కి. మి దూరంలో ఉన్న ఎస్సారెస్పీ కి నీళ్లు తీసుకురావట్లేదన్నారు.మెడిగడ్డ గేట్లు దించకుండానే పారుతున్న గోదావరి నుండి కన్నెపల్లి మోటార్ల ద్వారా నీళ్లు ఎత్తిపోసే అవకాశం ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా కావాలనే నీళ్లను అంద్రాకు వదిలేసిందన్నారు .అందుకే నేడు తెలంగాణ రాష్ట్రంలో తీవ్రమైన కరువు పరిస్థితులు వచ్చాయని, అందుకే ఇదీ ప్రకృతి తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ తెచ్చిన కరువని పునరుదఘటించారు.మనకున్న కృష్ణ , గోదావరి నదులే ఆంధ్రకూ ఉన్నాయని, అక్కడ లేని కరువు తెలంగాణ లో ఎందుకు ఉందని ఆయన ప్రశ్నించారు. ఎస్సారెస్పీ పునర్జీవం విస్మరణతో నిజామాబాద్ జిల్లాకు,బాల్కొండకు అన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ముందుచూపుతో రూపొందించిన 'ఎస్సారెస్పీ పునర్జీవ పథకం' అమలు చేస్తే వరద కాలువ ద్వారా ఎస్సారెస్పీ కి నీళ్లు మళ్లించి నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని లిఫ్టులు నడిపించి, చెరువులు నింపే అవకాశం ఉందిన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నేడు నిజామాబాద్ జిల్లా, బాల్కొండ నియోజకవర్గంలో చెరువుల్లో నీళ్లు లేక భూగర్భ జలాలు పడిపోయి బోర్లు నీళ్లు పోయక రైతులు గోసపడుతున్నారన్నారు. కరెంట్ కష్టాలు -- కాంగ్రెస్ చేతకానితనానికి నిదర్శనమన్నారు.తెలంగాణ ఏర్పడినప్పుడు 7,000 మెగావాట్లుగా ఉన్న కరెంట్ స్థాపిత సామర్థ్యాన్ని కేసీఆర్ 20,000 మెగావాట్లకు పెంచారన్నారు. ముందు చూపుతో కేసీఆర్ కొత్తగా ఎన్నో థర్మల్ విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేసి కరువులో కుడా విద్యుత్ కొరత రాకుండా కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యిలాగా ఆ విద్యుత్ కేంద్రాలను మీకు అప్పజెప్పితే వాటిని నడిపియ్యడం కూడా మీకు చేత కావట్లేదన్నారు. మన సింగరేణి లోని బొగ్గుని బయట రాష్ట్రాలకు అమ్ముకుంటూ మన థర్మల్ విద్యుత్ ప్లాంటలకు బొగ్గు లేకుండా చేసి కొత్తగూడెం (800 వీఔ), భద్రాద్రి (540 వీఔ), యాదాద్రి (4,000



వీఔ) వంటి థర్మల్ ప్లాంట్లను మూసేసి కరెంట్ కష్టాలు తీసుకోచ్చిన చేతకాని ప్రభుత్వం మీదని ఎద్దేవా చేశారు. బొగ్గులేని పక్క రాష్ట్రం ఏపీలో కరెంట్ కష్టాలు ఎందుకు లేవని, మన తెలంగాణ లో కరెంట్ కష్టాలు ఎందుకు ఉన్నాయని ఆయన ప్రశ్నించారు.మనకున్న కృష్ణ , గోదావరి నదులే ఆంధ్రకూ ఉన్నాయి.. అక్కడ లేని కరెంట్ కోతలు... తెలంగాణ లో ఎందుకు ఉన్నాయన్నారు.
కరోనా సంక్షోభంలో ప్రజలతో ఎవరున్నారు అనే విషయాన్ని ఒక్కసారి మనన చేసుకోవాలన్నారు.నాడు కరోనా వేళ ప్రజల ప్రాణాలు కాపాడిన చరిత్ర ప్రశాంత్ రెడ్డిదని . నేడు కరువు వస్తే ఎదుర్కోనే సత్తా లేక కుంటి సాకులు చెప్పడం మీ ప్రభుత్వానిదన్నారు.కరోనా విపత్తు వచ్చినప్పుడు కేసీఆర్ ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేసి ప్రజలను కంటికి రెప్పలా కాపాడారని, అలాంటి విపత్కర సమయంలో తెలంగాణ ప్రజలకు కేసీఆర్ తన మాటలతో మనో ధైర్యాన్ని, భరోసా ఇచ్చారన్నారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తన సొంత చొరవతో, నిధులతో ఆసుపత్రులను ఆధునీకరించి, నియోజకవర్గం లోని అన్ని హాస్పిటల్ బెడ్స్ ని ఆక్సీజన్ బెడ్స్ గా మార్చాడడం జరిగిందన్నారు. అలాగే కొన్ని హాస్పిటల్స్ లో ఐ సీ యు బెడ్స్ కుడా పెట్టించాడడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఎ.మోర్తాడ్‌లో సొంతంగా ఆక్సిజన్ బాటిలింగ్ ప్లాంట్ పెట్టించి ఆక్సీజన్ కొరత లేకుండా చూసాడని తెలిపారు.
కరోనా సమయంలో పేద ప్రజలకు నిత్యావసర సరుకులు ఇవ్వడమే కాకుండా నిత్యం ప్రజల మధ్యన ఉంటూ కరోనా సోకిన వ్యక్తులు ఉన్న క్వారంటైన్ సెంటర్ లు నిత్యం తిరుగుతూ తాను ప్రజలకు భరోసా కల్పించడం జరిగిందన్నారు.ఆనాడు మంత్రిగా తాను జిల్లా యంత్రాంగంతో వైద్య బృందాలతో నిత్యం సమీక్షలు నిర్వహిస్తూ కరోనా మహమ్మారి ని జిల్లాలో ఎదుర్కోవడంలో ఏంతో కృషి చేసానన్నారు.నాడు ప్రజలు చావుబతుకుల మధ్య ఉంటే రేవంత్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నేత ఎక్కడ దాక్కున్నారన్నారు.నేడు సీతక్క వచ్చి సుద్దులు ఇక్కడ చెబుతారని అన్నారు.గ్రామసభల్లో పారదర్శకంగా కాకుండా, కాంగ్రెస్ నాయకుల ఇళ్లల్లో కూర్చుని కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లు పంచుకుంటున్నారని అన్నారు .ఇండ్ల మంజూరు కోసం ముడుపులు తీసుకుంటున్నారని అన్నారు. వేల్పూర్ ఇందిరమ్మ కాలనీలో వేసిన సీసీ రోడ్లు, అలాగే కేసీఆర్ కాలనీ లో 110 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టి పేదలకు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అని సీతక్కకు గుర్తు చేశారు. ?కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలు అయిన ఒక్క కొత్త రోడ్డు వేయలేదు,పైగా చేసిన పనులకు బిల్లులు కుడా చెల్లించక కాంట్రాక్టర్లు పనులు చేయలేని పరిస్థితికి తీసుకోచ్చారన్నారు. ఇప్పటికైన కేసీఆర్ మీద , గత బీయర్ఎస్ ప్రభుత్వం మీద ఏడ్చుడు ఆపేసి.... రైతులకు సాగునీరు, కరెంట్ ఇవ్వడంపై, మహిళలకు, యువతకు మీరు ఇచ్చిన హామీల అమలుపై ద్రుష్టి పెట్టాలని సీతక్కకు ప్రశాంత్ రెడ్డి సూచించారు. అయిన సరే మీ తీరు మార్చుకోకపోతే తగిన సమయంలో ప్రజలె మీకు బుద్ధి చెప్పడం ఖాయమని వేముల స్పష్టం చేశారు.

## బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యేదెప్పుడో?..

- అర్థంతరంగా నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులు...
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా?.. పాలకుల నిర్లక్ష్యమా?..
- స్పందించని అధికారులు, ప్రజాప్రతినిధులు...



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రుద్రూర్ మండలంలోని రాయకూర్ గ్రామ శివారు నుండి బోధన్ వైపుకు వెళ్లే బ్రిడ్జి నిర్మాణ పనులను అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో రూ. 301.50 లక్షల వ్యయంతో 2023 వ సంవత్సరంలో చేపట్టారు. కాగా ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు మధ్యలోనే అర్ధంతరంగా నిలిపివేశారు. ఇప్పటికీ రెండు సంవత్సరాలు పైగా గడుస్తున్నాయని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో కూడా ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కాలేదని, పనులను మధ్యలోనే నిలిపివేశారని రైతులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ బ్రిడ్ నిర్మాణ పనులను అర్ధాంతరంగా మధ్యలోనే నిలిపివేయడంలో అంతర్యం ఏమిటని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా?. పాలకుల నిర్లక్ష్యమా? అనేది అర్థం కానీ పరిస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు. రాయకూర్ గ్రామం నుండి బ్రిడ్జి వరకు బీటి రోడ్డు నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయని, ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఈ విషయం పై బోధన్ సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా కూడా సబ్ కలెక్టర్ స్పందించలేదని గ్రామస్తులు, రైతులు వాపోతున్నారు. ఈ బ్రిడ్జ నిర్మాణ పనులు పూర్తవుతే పోతంగల్ మండలం, కోటగిరి మండలం, రుద్రూర్ మండలాల్లోని గ్రామస్తులకు, రైతులకు బోధన్ వెళ్లడానికి కేవలం 5 కిలోమీటర్లు ఉంటుందని, ఈ మార్గంలో సులువుగా వెళ్లొచ్చన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు వెంటనే స్పందించి ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదుగాలి

**మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క**



సదాశివనగర్, బతుకమ్మ : మహిళలు సామాజికంగా, ఆర్థికంగా ఎదుగా లని అప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని భవనాన్ని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క అన్నారు. రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన మహిళా సమాఖ్య భవనాన్ని సీతక్క, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ తో కలిసి ప్రారంభించారు. గతంలో పోసానిపేట్ గ్రామానికి చెందిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ సంఘ కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి ప్రత్యేక భవనం అవస రమని ఎమ్మెల్యే మదన్ మోహన్ ని కలిసి విజ్ఞప్తి చేశారు. మహిళల అవసరాన్ని గుర్తించిన ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామానికి విచ్చేసిన మంత్రి సీతక్క కి, ఎమ్మెల్యే మదన్ మోహన్ కి మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసు కుని, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఎమ్మెల్యేకు మహిళా సంఘాల సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా నిర్మించిన ఈ భవనం మహిళా సంఘాల సభ్యులకు సమావేశాలు నిర్వహిం చుకోవడానికి, పొదుపు కార్యకలాపాలు చేపట్టడానికి, సంఘాల ద్వారా అమలయ్యే కార్యక్రమాలను సమర్థవంతంగా కొనసాగించుకోవడానికి ఎంతగానో ఉపయోగపడనుందన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ,?స్వయం సమృద్ధి సాధించడంలో స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు

# శ్రీకారం చుట్టిన మంత్రి సీతక్క







బాన్సు వాడ, బతుకమ్మ :బాన్సువాడ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, నూతన నిర్మాణాలకు భూమిపూజ కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభోత్సవాలు, భూమిపూజలు నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి అనసూయ సీతక్క, మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి , జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్ , రాష్ట్ర మాజీ ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజు , మాజీ డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి , కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ లతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాన్సువాడ గ్రామీణ మండలం కొయ్యగుట్ట తాండలో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనం, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలకు మంత్రి సీతక్క భూమిపూజ నిర్వహించారు. అనంతరం బాన్సువాడ పట్టణంలోని 3వ వార్డులో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. అలాగే బాన్సువాడ గ్రామీణ మండలం బోర్లం గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ...ఈ అభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచడంలో తొడ్పాడుతాయి అన్నారు. మహిళా సంఘాలకు అవసరమైన వసతులను అందుబాటులోకి తీసుకురావడానికి దోహదపడనున్నాయి అని తెలిపారు . ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ, స్తానిక ప్రాంతాల ప్రగతికి ప్రభుత్వం కృషి చేస్తోందిఅని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో బాన్సువాడ పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ కాసుల విజయ , కౌన్సిలర్లు, బాన్సువాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.